క్లుప్తంగా

24తో ముగియనున్న ఐటీఐ దరఖాస్తుల స్వీకరణ

ఎచ్చెర్ల క్యాంపస్: ప్రభుత్వ, ప్రైవేట్ ఐటీఐల్లో ప్రవేశాలకు ఆన్‌లైన్‌లో నిర్వహిస్తున్న దరఖాస్తుల స్వీకరణ ఈ నెల 24తో ముగియనుందని ఎచ్చెర్ల ప్రభుత్వ ఐటీఐ ప్రిన్సిపాల్, జిల్లా ప్రవేశాల కన్వీనర్ ఎల్.సుధాకర్‌రావు చెప్పారు. ఎచ్చెర్ల ఐటీఐలో బుధవారం ఆయన మాట్లాడుతూ జిల్లాలో మూడు ప్రభుత్వ, 20 ప్రైవేట్ ఐటీఐలు ఉన్నాయని చెప్పారు. 3806 సీట్లు అందుబాటులో ఉన్నట్లు తెలిపారు. ఆసక్తి ఉన్న విద్యార్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకొని, ప్రభుత్వ ఐటీఐల్లో దరఖాస్తుల పరిశీలనకు హాజరు కావాలని చెప్పారు. 10వ తరగతి ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

జాబ్‌మేళాకు స్పందన


ఉద్యోగాలకు ఎంపికైన అభ్యర్థులతో నిర్వాహకులు

రణస్థలం: రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఎన్‌ఈఆర్ స్కూల్‌లో నిర్వహించిన మెగా జాబ్‌మేళాకు విశేష స్పందన లభించింది. 21 ప్రయివేటు సంస్థల ప్రతినిధులు 781 మంది నిరుద్యోగ యువతకు ఇంటర్వ్యూలు నిర్వహించారు. అందులో ప్రతిభ కనబరిచిన 302 మంది వివిధ కంపెనీల్లో ఉద్యోగాలకు ఎంపికైనట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి యు.సాయికుమార్ చెప్పారు. కార్యక్రమంలో ఎచ్చెర్ల ఎమ్మెల్యే ఎన్.ఈశ్వరరావు, జిల్లా ఉపాధి అధికారి సుధ, సెట్‌శ్రీ సీఈవో ప్రసాదరావు, ఏడీ కవిత, ఎన్‌ఈఆర్ సంస్థల డైరెక్టర్ ఎన్.తేజ తదితరులు పాల్గొన్నారు.

దురలవాట్లకు దూరంగా ఉండాలి


సివిల్ జడ్జి వంశీకృష్ణను సన్మానిస్తున్న గ్రామస్తులు

గార: యువత చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని, ఉన్నతమైన చదువులతో ఏదైనా సాధించవచ్చని తూర్పుగోదావరి జిల్లా అనపర్తి జూనియర్ సివిల్ జడ్జి మజ్జి వంశీకృష్ణ అన్నారు. బుధవారం స్వగ్రామమైన కళింగపట్నం పంచాయతీ నగరాలపేటకు తొలిసారి రావడంతో గ్రామస్తులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచే ఉన్నత లక్ష్యాలను ఎంచుకోవాలన్నారు. అనంతరం ఉమాపైడేశ్వర ఆలయం వద్ద వంశీకృష్ణకు దుశ్శాలువ, జ్ఞాపికను ఇచ్చి సత్కరించారు. కార్యక్రమంలో తల్లిదండ్రులు సూరిబాబు, వెంకటలక్ష్మీ, సర్పంచ్ ప్రతినిధి తాన్నె అప్పలరాజు, మజ్జి రమణ, ముంజేటి బాబుసాయిరాం తదితరులు పాల్గొన్నారు.

నీటితీరువా వసూళ్లు వేగవంతం చేయాలి


సమావేశంలో మాట్లాడుతున్న తహసీల్దార్ సరిత

జి.సిగడాం: రైతుల నుంచి శరవేగంగా నీటితీరువా వసూలు చేయాలని తహసీల్దార్ ఎం.సరిత సిబ్బందిని ఆదేశించారు. బుధవారం స్థానిక కార్యాలయంలో వీఆర్‌ఓలతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ భూ సమస్యలపై ప్రత్యేక దృష్టిపెట్టి వాటిని పరిష్కారం చేసే దిశగా పని చేయాలన్నారు. సమావేశంలో డీటీ ఎన్.నిర్మల, ఆర్ఎస్‌డీటీ గాయత్రి, ఆర్ఐ ఆబోతుల రాధ, సర్వేయర్ శాంతారావు, ఉమాపట్నాయక్, భూపతి నర్సింగరావు పాల్గొన్నారు.

యోగాతో మానసిక ప్రశాంతత


సహజ యోగాపై అవగాహన కల్పిస్తున్న ప్రతినిధులు

ఎచ్చెర్ల : యోగా, ధ్యానంతో మానసిక ప్రశాంతత చేకూరుతుందని సహజ యోగా ట్రస్ట్ రాష్ట్ర కో–ఆర్డినేటర్ రామకృష్ణ అన్నారు. లావేరు మండలం లక్ష్మీపురం పంచాయతీ పటన్నవానిపేట, రేగపాలెం గ్రామాల్లో మాతాజీ నిర్మలాదేవీ చైతన్య రథంతో పర్యటించి సహజ యోగా ధ్యాన ప్రక్రియపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుత పోటీ ప్రపంచంలో ప్రతీ ఒక్కరు తీవ్ర ఒత్తిడికి లోనవుతున్నారని, దీనిని అధిగమించాలంటే ధ్యానం ఒక్కటే మార్గమని చెప్పారు. కార్యక్రమంలో సహజయోగులు కాగితాల గోవిందరెడ్డి, శ్రీను, నర్సింహులు, పి.భాస్కరరావు, లింగాల శ్రీనివాసరావు, కాంతారావు, రమణమ్మ పాల్గొన్నారు.

కష్టమే మిగిలింది!

- మామిడి రైతులు గగ్గోలు
- ఓవైపు దిగుబడి లేక..మరోవైపు గిట్టుబాటు ధర రాక అవస్థలు
- దళారులదే రాజ్యం


మామిడికాయలు

జి.సిగడాం : ఆరుగాలం శ్రమించి పంటను నమ్ముకుంటున్న రైతులకు చివరకు నిరాశే మిగులుతోంది. ప్రకృతి వైపరీత్యాలు, ఇతరత్రా కారణాల వల్ల ఈ ఏడాది మామిడి దిగుబడులు గణనీయంగా తగ్గాయి. దీనికితోడు మద్దతు ధర లేకపోవడంతో దళారులు చెప్పిన ధరకే మామిడి కాయలు అమ్ముకోవాల్సి వస్తోందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జి.సిగడాం పరిసర ప్రాంతాల్లో ఈ నెలలో మూడు సార్లు భారీ గాలులు వీయడంతో పెద్ద ఎత్తున మామిడికాయలు నేలపాలయ్యాయి. వాటిని కొనేవారే కరువయ్యారు. ఈ పరిస్థితిలో అరకొరగా దిగుబడి వచ్చిన బంగినపల్లి, సువర్ణరేఖ, కోలంగోవ, రసాలు వంటి మామిడికాయలను కొందరు వ్యాపారులు కిలో రూ. 15నుంచి రూ.25 మాత్రమే చెల్లించి రైతుల వద్ద నుంచి కొనుగోలు చేస్తున్నారు. దీంతో ఎకరా మామిడితోటకు రూ.10వేలు రావడం కూడా కష్టంగా ఉంటోందని రైతులు వాపోతున్నారు. మామిడిపూత సమయంలో ఎకరాకు రూ.5వేలు నుంచి రూ.8వేలు వరకు పూత నిలబెట్టేందుకు మందులు పిచికారీ చేశామని, ఇప్పుడు దిగుబడి, మద్దతు ధర లేక నష్టపోవాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం స్పందించి మామిడి రైతులను ఆదుకోవాలని కోరుతున్నారు.


ఎగుమతికి సిద్ధంగా ఉన్న మామిడి బస్తాలు


లారీ ద్వారా ఇతర ప్రాంతాలకు తరలిస్తున్న దృశ్యం

నష్టం వచ్చింది..



నేను 50 ఎకరాల్లో మామిడి తోట కొనుగోలు చేశాను. ఈ ఏడాది పంట దిగుబడి సరిగ్గా రాలేదు. ఇటీవల వీచిన గాలులకు కాయలు నేలపాలయ్యాయి. వాటిని పెంటకుప్పల్లోనే పారబోశాం. కొన్ని కాయలు బాగుంటే మార్కెట్‌లో ధరలేదు. కష్టమంతా బుగ్గిపాలైంది. ధర మాత్రం రూ.15మాత్రమే పలుకుతోంది. ఈ ఏడాది భారీగా నష్టం వచ్చింది.

– వజ్జిపత్తి శ్రీనివాసరావు, మద్రివలస, జి.సిగడాం

మందులకే రాలేదు



పూత నిలబెట్టేందుకు పిచికారి చేసిన మందులు ఖర్చు కూడా ఈ ఏడాది రాలేదు. ఎనిమిది ఎకరాల్లో మామిడిపంట సాగుచేశాం. ఎకరాకు సువారు రూ. 8వేలు వరకు ఖర్చుచేశాం. దుక్కిలు, కంచె, మందులకు ఖర్చు పెట్టాం. ఖర్చులు పోగా ఎకరాకు రూ.2వేలు మాత్రమే మిగిలింది.

– ఎందువ ఉమాశంకర్, సంతవురిటి, జి.సిగడాం

చివరి క్షణంలో పాలక మండలి సమావేశం రద్దు

ఎచ్చెర్ల క్యాంపస్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయంలో గురువారం పాలక మండలి సమావేశం నిర్వహించాలని తొలుత నిర్ణయించినా చివరి క్షణంలో రద్దు చేశారు. వర్చువల్ పద్ధతిలో ఈ సమావేశం నిర్వహించేందుకు వర్సిటీ అధికారులు ఎజెండా సైతం సిద్ధం చేసుకున్నారు. ఉన్నత విద్యాశాఖ, ఉన్నత విద్యా మండలి, ఆర్థిక శాఖ అధికారులు వర్చువల్‌గా పాల్గొంటారని ముందుగా తెలియజేశారు. చివరి క్షణంలో రద్దు చేయటంతో వర్సిటీ అధికారులు నిరాశ చెందినట్లు సమాచారం. ఈసీ సమావేశంలో 12 మంది వరకు పాల్గొంటారు. ప్రతి ఆరు నెలలకు ఒకసారి సమావేశం నిర్వహించి, పాలక మండలి ఆమోదం మేరకు విధాన పరమైన నిర్ణయాలు అమలు చేయాల్సి ఉంటుంది. కూటమి ప్రభుత్వం వచ్చి ఏడాది అవుతున్నా కనీసం ఒక్కసారి సైతం పాలక మండలి సమావేశం నిర్వహించ లేదు. బడ్జెట్ ఆమోదం కోసం సైతం నిర్వహించలేదు. మరోవైపు కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత 17 మంది వీసీలు రాజీనామాలు చేశారు. స్థానిక అధికారిపైనా ఒత్తిడి వచ్చినట్లు సమాచారం. దీంతో అధికారిపై కక్షతో పాలక మండలి సమావేశం సైతం నిర్వహణకు అనుమతి ఇవ్వటం లేదన్న చర్చ వర్సిటీలో సాగుతోంది. మరోవైపు, వర్సిటీ నిధుల సమస్యతో ఇబ్బందిపడుతోంది. అంతర్గత నిధులతోనే నెట్టుకొస్తున్నారు. మొత్తమ్మీద కూటమి ప్రభుత్వ తీరు వర్సిటీ ప్రగతి, ప్రవేశాలు, నిర్వహణపై సైతం ప్రభావం చూపుతోంది.

యువతి అదృశ్యం

ఎచ్చెర్ల క్యాంపస్: ఎస్ఎంపురం పంచాయతీ లింగాలపేటకు చెందిన 19 ఏళ్ల యువతి ఈ నెల 19వ తేదీ నుంచి కనిపించడం లేదని తండ్రి ఎచ్చెర్ల పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. టైలరింగ్ శిక్షణకి వెళ్లి తిరిగి రాలేదని ఫిర్యాదులో పేర్కొన్నారు. పోలీసులు బుధవారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అయ్యప్పకు క్షీరాభిషేకాలు


బలగలో పూజలందుకుంటున్న అయ్యప్పస్వామి

శ్రీకాకుళం కల్చరల్: బలగ అయ్యప్పస్వామి దేవాలయంలో బుధవారం స్వామివారికి క్షీరాభిషేకాలు జరిగాయి. ఆలయ అర్చకులు దేవకొండ శంకర నారాయణ శర్మ ఆధ్వర్యంలో స్వామివారికి ప్రత్యేక పూజలు చేసి అలంకరించారు. పాత శ్రీకాకుళంలోని కలెక్టర్ బంగ్లా ఎదురుగా ఉన్న ధర్మశాస్తా ఆలయంలోనూ స్వామివారికి అభిషేకాలు, ప్రత్యేక పూజలు జరిగాయి.

పక్కాగా ఇంటింటా సర్వే


సర్వే తీరును పరిశీలిస్తున్న సమన్వయకర్త గోవిందరావు

గార: ప్రత్యేక అవసరాల గల పిల్లల గుర్తింపు కోసం ఇంటింటా సర్వే పక్కాగా చేపట్టాలని జిల్లా సమగ్ర శిక్ష సహిత విద్య సమన్వయకర్త బి.గోవిందరావు అన్నారు. బుధవారం కుమ్మరిపేటలో జరుగుతున్న సర్వేను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మే 13 నుంచి జూన్ 9వ తేదీ వరకు సర్వే జరుగుతుందని, మానసిక వైకల్యం, వినికిడి లోపం, దృష్టిలోపం, ఆటిజమ్, శారీరక వైకల్యం, రక్తహీనత వంటి 21 రకాల వైకల్యాలు ఉన్న పిల్లలను గుర్తించనున్నట్లు వివరించారు. వీరిని సమీప పాఠశాలలో చేర్పించి, ప్రభుత్వం నుంచి అన్ని సౌకర్యాలు కల్పిస్తామన్నారు. కార్యక్రమంలో సహ సమన్వయకర్త ఉమాదేవి, ఎంఈవో–2 పి.వినోదిని, ప్రత్యేక ఉపాధ్యాయులు ఎ.రఘులక్ష్మీ, ఎస్.సత్యన్నారాయణ, ఎల్.అమ్మాజీ పాల్గొన్నారు.

విద్యార్థులకు చెస్ పోటీలు


చదరంగం ఆడుతున్న విద్యార్థులు

ఎచ్చెర్ల: వేసవి శిక్షణా శిబిరంలో భాగంగా లావేరు శాఖా గ్రంథాలయంలో బుధవారం విద్యార్థులతో చదరంగం పోటీలు నిర్వహించారు. అరవల్లి అభిరాం, సిద్దార్థ, నక్కిన హర్షవర్ధన్‌లు విజేతలుగా నిలిచారు. ఈ సందర్భంగా గ్రంథాలయ అధికారి మురపాక శ్రీనివాసరావు మాట్లాడుతూ చదరంగంతో ఏకాగ్రత పెరుగుతుందన్నారు. కార్యక్రమంలో గ్రంథాలయ సహాయకులు టి.వీరభద్రుడు, విద్యార్థులు పాల్గొన్నారు.

రాజీవ్‌గాంధీ సేవలు చిరస్మరణీయం


రాజీవ్‌గాంధీ చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు

శ్రీకాకుళం అర్బన్: శాస్త్ర, సాంకేతిక రంగంలో భారతదేశంలో విప్లవం సృష్టించిన దార్శనికుడు రాజీవ్‌గాంధీ అని డీసీసీ అధ్యక్షుడు అంబటి కృష్ణారావు అన్నారు. రాజీవ్ గాంధీ వర్ధంతి కార్యక్రమాన్ని శ్రీకాకుళంలోని ఇందిరా విజ్ఞాన్‌భవన్‌లో బుధవారం నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా మైనారిటీ సెల్ అధ్యక్షుడు చాన్ బాషా, డీసీసీ ప్రధాన కార్యదర్శి సైదుల్లా ఖాన్, సోడవరం చంద్రశేఖర్, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా చిత్రలేఖనం పోటీలు



శ్రీకాకుళం అర్బన్: బలగ హడ్కో కాలనీలోని శాఖా గ్రంథాలయంలో వేసవి శిక్షణా శిబిరంలో భాగంగా బుధవారం గ్రంథాలయ అధికారి పి.ఉగ్రేసేను ఆధ్వర్యంలో చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. 39 మంది పిల్లలు పాల్గొని ప్రతిభ కనబరిచారు. అంతకుముందు పిల్లలతో ధ్యానం చేయించారు. నీతి కథలు చెప్పి సారాంశాన్ని వివరించారు. కార్యక్రమంలో గ్రంథాలయ సహాయకురాలు కె.అనిత, విద్యార్థులు పాల్గొన్నారు.

పలకల తొలగింపుతో పాట్లు


థియేటర్ ఎదురుగా పలకలు తొలగించిన దృశ్యం


ప్లాట్‌ఫారంపై విరిగిన పలక

- ఫీట్లు చేస్తున్న నగరవాసులు
- పట్టించుకోని అధికారులు

శ్రీకాకుళం రూరల్:

నగర కార్పొరేషన్ పరిధిలో డ్రైనేజీల మరమ్మతుల పేరిట పలుచోట్ల పలకలు తొలగించి వాటిని తిరిగి ఏర్పాటు చేయకపోవడంతో ప్రజలకు ఇబ్బందులు తప్పడం లేదు. రోజుల తరబడి అలాగే వదిలేస్తుండటంతో ఫీట్లు చేయాల్సి వస్తోందని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నగరంలోని సన్‌మ్యాక్స్ థియేటర్ తదితర ప్రాంతాల్లో డ్రైనేజీలపై పలకలు తొలగించారు. దీంతో రాకపోకలకు ఆయా ప్రాంతాల వారు ఇబ్బందులు పడుతున్నారు. కొన్నిచోట్ల తాత్కాలికంగా చెక్కలు ఏర్పాటు చేస్తున్నా వాహనాలు ఎక్కించేందుకు అవస్థలు తప్పడం లేదని పలువురు వాపోతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి సకాలంలో పలకలు తిరిగి ఏర్పాటు చేయించాలని కోరుతున్నారు.

పలకలు తీసేశారు..



కాలువలపై ఎక్కడికక్కడ పలకలన్నీ తొలగించారు. దీంతో డ్రైనేజీ మీదుగానే రాకపోకలు సాగించాల్సి వస్తోంది.

– విజయ్‌కుమార్, శ్రీకాకుళం

ఎక్కడికక్కడే గోతులు



శ్రీకాకుళం పరిధిలోని ప్రధాన కూడళ్లల్లో గోతులు ఎక్కువగా ఉన్నాయి. ఏమాత్రం అజాగ్రత్తగా ఉన్నా కాలువల్లోకి కూరుకుపోవడమే.

– రూప, శ్రీకాకుళం

గోతుల రోడ్డుతో పాట్లు



తోటపాలేం కూడలి నుంచి కొత్తపేట, సెగిడిపేట, ముద్దాడ అంబేడ్కర్ నగర్ వరకు వెళ్లే ఐదు కిలోమీటర్ల రహదారి పూర్తిగా గోతులమయంగా మారింది. రూ.5.20 కోట్ల నాబార్డు నిధులను ఈ రోడ్డు నిర్మాణానికి మంజూరు చేశారు. పనులు మాత్రం ఇంతవరకు ప్రారంభం కాలేదు. దీంతో వాహనచోదకులు రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

– ఎచ్చెర్ల క్యాంపస్

రాళ్లు తేలిన రహదారి



పాలఖండ్యాం పంచాయతీ సీతారాంపురం నుంచి సంతవురిటి కోనేరు వరకు బీటీ రోడ్డు నిర్మాణం కోసం వేసిన మెటల్ పూర్తిగా తేలిపోవడంతో వాహనచోదకులు నరకయాతన అనుభవిస్తున్నారు. పనులు అర్ధంతరంగా నిలిచిపోవడంతో పాటు రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు స్పందించి పనులు పూర్తి చేయాలని పలువురు కోరుతున్నారు.

– జి.సిగడాం

ఎన్నాళ్లీ ఎదురుచూపులు?



నారాయణపురం కుడికాలువ మరమ్మతుల కోసం ఎదురుచూస్తోంది. మరి కొన్ని రోజుల్లో ఖరీఫ్ సీజన్ ప్రారంభం కానుంది. వర్షాలు పడే లోపు కాలువల్లో తుప్పలు, మట్టి మేటలు తొలగించి సజావుగా సాగునీరు అందించాలని రైతులు కోరుతున్నారు.

– ఎచ్చెర్ల క్యాంపస్

వైభవంగా మహాకుంభాభిషేక మహోత్సవం


సువత్సలా సమేత ఆంజనేయస్వామి


కలశాలకు పూజలు చేస్తున్న అర్చకులు

శ్రీకాకుళం కల్చరల్: నగరంలోని పుణ్యపువీధిలో సీతారామచంద్రమూర్తి సహిత సువత్సల అభయాంజనేస్వామి ఆలయంలో బుధవారం మహా కుంభాభిషేక మహోత్సవం ఘనంగా జరిగింది. ఆలయ ధర్మకర్త ముక్కాల కొండబాబు, అరసవల్లి అర్చకులు నేతేటి హరిబాబు ఆధ్వర్యంలో భక్తులు 301 కలశాలను సిద్ధం చేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం సువత్సలా కల్యాణ మహోత్సవం జరిగింది. కార్యక్రమంలో గొండు స్వాతి, హనుమత్ భక్త బృందం సభ్యులు పాల్గొన్నారు.

శతశాతం ఫలితాలకు ప్రతిభా పురస్కారం


ప్రశంసాపత్రాన్ని అందుకుంటున్న ప్రిన్సిపాల్ స్వరాజ్యలక్ష్మి

శ్రీకాకుళం న్యూకాలనీ: నగరంలోని హయాతీనగరంలో ఉన్న మహాత్మా జ్యోతిరావు పూలే ఏపీ రెసిడెన్షియల్ బాలికల గురుకుల పాఠశాల విద్యార్థినులు సాధించిన ప్రతిభకు పురస్కారం లభించింది. పదో తరగతి పబ్లిక్ పరీక్షలకు 48 మంది బాలికలు హాజరుకాగా అందరూ ఉత్తీర్ణులై శతశాతం ఫలితాలను సాధించారు. తాజాగా విజయవాడలో జరిగిన అభినందన–అవార్డుల ప్రదానోత్సవంలో బీసీ వెల్ఫేర్ మంత్రి సవిత చేతులమీదుగా ప్రిన్సిపాల్ గొలివి స్వరాజ్యలక్ష్మి ప్రశంసాపత్రాన్ని అందుకున్నారు. భవిష్యత్తులోనూ ఇదే స్ఫూర్తితో ఉత్తమ ఫలితాలు సాధించాలని మంత్రి ఆకాంక్షించినట్టు ప్రిన్సిపాల్ స్వరాజ్యలక్ష్మి తెలిపారు.

బాడీబిల్డింగ్ చాంపియన్‌గా హేమంత్‌కుమార్


చాంపియన్ హేమంత్‌కుమార్, రన్నరప్ సాయిలతో నిర్వాహకులు విజయ్‌కుమార్ తదితరులు


జూనియర్స్ చాంపియన్ రోహిత్‌కు బహుమతిని అందజేస్తున్న ఎస్ఐ సంతోష్

శ్రీకాకుళం న్యూకాలనీ: ఉత్తరాంధ్ర జోనల్ స్థాయి బాడీబిల్డింగ్ చాంపియన్‌గా విశాఖపట్నంకు చెందిన జి.హేమంత్‌కుమార్ నిలిచాడు. శ్రీకాకుళం స్టార్ బాడీబిల్డింగ్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి వి.విజయ్‌కుమార్, అధ్యక్షుడు బలగ ప్రసాద్ ఆధ్వర్యంలో నగరంలోని కోడిరామ్మూర్తి స్టేడియం సమీపంలో ఉన్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కళావేదికలో మంగళవారం అర్ధరాత్రి వరకు జరిగిన ఈ జోనల్‌స్థాయి బాడీబిల్డింగ్ పోటీలు ఆద్యంతం ఆకట్టుకున్నాయి. ఎంతో ప్రతిష్టాత్మకంగా జరిగిన ఈ పోటీలో ఉత్తరాంధ్ర జిల్లా నుంచి వందమంది వరకు బాడీబిల్డర్లు పాల్గొన్నారు. తమ కండల ప్రదర్శనలతో ఆహూతులను మంత్రముగ్ధులను చేశారు. ఈ పోటీల్లో చాంపియన్ ఆఫ్ ది చాంపియన్‌గా జి.హేమంత్ కుమార్(విశాఖ), రన్నరప్‌గా సాయి (విశాఖ) నిలిచాడు. జూనియర్ విభాగంలో శ్రీకాకుళం జిల్లా ఇచ్ఛాపురానికి చెందిన ఎం.రోహిత్‌కుమార్ విజేతగా నిలిచాడు. వీరికి స్థానిక ఎస్ఐ ఆర్.సంతోష్ బహుమతులు ప్రధానం చేశారు. అండర్–55, 60, 65, 70, 75, 80, తదితర విభాగాల్లో పోటీలు జరిగాయి. విజేతలకు రూ.50వేల నగదు బహుమతులు, పతకాలు, మెమోంటోలు, ట్రోఫీలు, ప్రసంశాపత్రాలు అందజేశారు. బాడీ బిల్డర్స్ అసోసియేషన్ నుంచి వాడపల్లి శ్రీనివాస్, రాజు, ఈశ్వర్, బాబి, కోటిరెడ్డి, అశోక్ కుమార్, చిన్నబాబు, రాజారావు, కోటేశ్వరరావు, బి.సూరిబాబు, అప్పన్న, నాగు పాల్గొన్నారు.

ఎంపీసీ స్ట్రీం పరీక్షలు ప్రారంభం

ఎచ్చెర్ల క్యాంపస్: ఈ నెల 19న ప్రారంభమైన ఏపీఈఏపీ సెట్ – 2025 పరీక్షలు కొనసాగుతున్నాయి. 19, 21వ తేదీల్లో బైపీసీ స్ట్రీం పరీక్షలు నిర్వహించారు. ఎంపీసీ స్ట్రీం పరీక్షలు బుధవారం ప్రారంభమయ్యాయి. చిలకపాలెంలోని శ్రీశివానీ ఇంజినీరింగ్ కాలేజ్ ఎచ్చెర్లలోని శ్రీ వేంకటేశ్వరా ఇంజినీరింగ్ కాలేజీలోపరీక్షలు జరిగాయి.